# వరంగల్ సభ సక్సెస్‌తో బీఆర్ఎస్ నేతల్లో ఉత్సాహం

## ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఒక్కతాటిపైకి పార్టీ శ్రేణులు



వరంగల్ బీఆర్ఎస్ బహిరంగ సభకు భారీ కార్ల ర్యాలీతో తరలివెళ్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, పార్టీ శ్రేణులు (ఫైల్ )

ఎల్బీనగర్, ఏప్రిల్ 28: వరంగల్ సభ సక్సెస్‌తో ఎల్బీనగర్ బీఆర్ఎస్ నాయకులు ఉత్సాహంతో కదం తొక్కుతున్నారు. కేసీఆర్ సభ సక్సెస్ కావడం, అన్నింటికీ బీఆర్ఎస్ అండగా ఉంటుందని, ఏ ఆపద వచ్చినా కేసీఆర్ మీ వెంట ఉంటాడంటూ అధినేత ఇచ్చిన భరోసాతో నాయకులు, కార్యకర్తల్లో నూతన ఉత్సాహం అలుముకుంటోంది. నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీని అటు కాంగ్రెస్, ఇటు బీజేపీ రెండు పార్టీలు ఒక్కటై విమర్శలు చేయడంతో పాటుగా అభివృద్ధిలో అడ్డుకాలు వేసే పనిలో ఉన్న నేపథ్యంలో బీఆర్ఎస్ శ్రేణులు వరంగల్ రజతోత్సవ మహాసభకు పార్టీ శ్రేణులను భారీగా తరలించడంతో పాటుగా పార్టీ నాయకులు, కార్యకర్తలంతా ఒక్కటై ముందడుగు వేశారు. దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి నాయకత్వంలో 11 డివిజన్లలో పార్టీ జెండా అవిష్కరణ కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేసుకుని వరంగల్ సభకు 550 కార్లు, 20 బస్సుల భారీ ర్యాలీతో పెద్ద అంబర్‌పేట్ ఔటర్ రింగ్‌రోడ్డులో ప్రారంభమై వరంగల్ రహదారిపై సాగిన తీరుతో కార్యకర్తలు పెల్లుబికిన ఉత్సాహంతో ఉన్నారు.

ఎమ్మెల్యే ఆధ్వర్యంలో గడ్డిఅన్నారం, చైతన్యపురి, కొత్తపేట, నాగోలు, మన్సూరాబాద్, హయత్‌నగర్, బీఎన్‌రెడ్డినగర్, వనస్థలిపురం, హస్తినాపురం, చంపాపేట, లింగోజిగూడ డివిజన్ల పరిధిలో బీఆర్ఎస్ పార్టీ జెండాల ఆవిష్కరణ కార్యక్రమాలతో ఒక్కతాటిపైకి వచ్చిన పార్టీ శ్రేణులు సభ సక్సెస్‌తో మరింత ఉత్సాహంతో ఉన్నారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మార్గనిర్దేశంలో కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ జీవీ సాగర్‌రెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షుడు లింగాల రాహుల్ గౌడ్, రాగిరి ఉదయ్ గౌడ్, నాగోలు డివిజన్ నుండి సీనియర్ నాయకుడు అనంతుల రాజారెడ్డి, మాజీ కార్పొరేటర్ చెరుకు సంగీత ప్రశాంత్ గౌడ్, డివిజన్ అధ్యక్షుడు తూర్పాటి చిరంజీవి, చైతన్యపురి డివిజన్ మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు తోట మహేష్‌యాదవ్, నాయకులు సోంటి చంద్రశేఖర్‌రెడ్డి, శివప్రకాష్, గడ్డిఅన్నారం డివిజన్ నుండి మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్‌కుమార్, అధ్యక్షుడు జక్కల శ్రీశైలం యాదవ్, రమేష్ ముదిరాజ్, లింగోజిగూడ డివిజన్ నుండి డివిజన్ అధ్యక్షుడు వరప్రసాద్‌రెడ్డి, నాయకులు తిలక్‌రావు, శ్రీధర్, చంపాపేట డివిజన్ నుండి డివిజన్ అధ్యక్షుడు రాజిరెడ్డి, కృష్ణమాచారి , హస్తినాపురం డివిజన్ నుండి మాజీ కార్పొరేటర్ రమావత్ పద్మానాయక్, డివిజన్ అధ్యక్షుడు సత్యంచారి, బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ నుండి అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, వనస్థలిపురం డివిజన్ నుండి మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, అధ్యక్షుడు చింతల రవికుమార్ గుప్త, హయత్‌నగర్ డివిజన్ నుండి మాజీ కార్పొరేటర్ సామ తిరుమల్‌రెడ్డి, అధ్యక్షుడు చెన్నగోని శ్రీదర్ గౌడ్, మన్సూరాబాద్ డివిజన్ నుండి మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, నాయకులు రఘువీర్ రెడ్డి, జగదీష్‌యాదవ్, నాగరాజు తదితరులతో పాటుగా పెద్ద సంఖ్యలో నాయకులు సమావేశానికి వెళ్లారు. వారంతా సభ విజయవంతం కావడంతో పార్టీ శ్రేణులంతా మరింత ఉత్సాహంతో ముందుకు వెళ్లేందుకు సన్నద్ధం అవుతున్నారు.

### కేసీఆర్ ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది : ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ వరంగల్ రజతోత్సవ సభ ప్రజల గుండె చప్పుడును విన్పించింది. తెలంగాణ ప్రజల ఇంటిపార్టీగా బీఆర్ఎస్‌ను రాష్ట్రవ్యాప్తంగా అక్కున చేర్చుకున్నారు. కేసీఆర్ రావాలి... కేసీఆర్ కావాలి.. అంటూ ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. వరంగల్ సభ భారీగా సక్సెస్ కావడంతో కాంగ్రెస్ ప్రభుత్వంలో వణుకు పుట్టింది. ప్రజల్లో బీఆర్ఎస్‌పై , కేసీఆర్‌పై సంపూర్ణ విశ్వాసం ఉంది. సభ సక్సెస్ అందరినీ మరింత ఉత్సాహంతో ముందుకు సాగేలా చేసింది.

## మురుగునీటి సమస్యల నుంచి విముక్తి చేస్తా : ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



న్యూ గడ్డిఅన్నారం కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్, ఏప్రిల్ 28: టన్నలింగ్ వ్యవస్థ ఏర్పాటు చేసి మురుగునీటి సమస్యల నుంచి విముక్తి చేస్తానని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. న్యూ గడ్డిఅన్నారం కాలనీలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పర్యటించి అనంతరం కాలనీవాసులు ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, ఎవరికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా టన్నలింగ్ వ్యవస్థ ఏర్పాటు చేసి మురుగునీటి సమస్యల నుంచి విముక్తి చేయడం జరుగుతుందని హామీ ఇచ్చారు. ఈ పనుల్లో భాగంగా మరోసారి అధికారులచే చర్చించి పక్క ప్రణాళికలు సిద్ధం చేసి పనులు ప్రారంభం చేయడం జరుగుతుందని తెలిపారు. ఎవరు ఎలాంటి ఆందోళనలకు గురికావొద్దు అని తెలిపారు. ఆ పనుల్లో భాగంగా మీరు కూడా అధికారులకు తగు సహాయ, సహకారాలు అందించాలని కోరారు. అలాగే నాలాల్లో పేరుకుపోయిన సీల్ట్ తీయించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్ కుమార్, కాలనీవాసులు పాల్గొన్నారు.

## మద్యానికి డబ్బులు ఇవ్వాలని పానీపూరి వ్యాపారిని కొట్టిన రౌడీషీటర్

మలక్ పేట, ఏప్రిల్ 28: మద్యానికి డబ్బులు ఇవ్వాలని పానీపూరి వ్యాపారిని కొట్టి, తోపుడు బండిని ధ్వంసం చేసిన రౌడీషీటర్ తో పాటు మరో వ్యక్తిని చాదర్ ఘాట్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం మధ్యప్రదేశ్ రాష్ట్రం దతియా జిల్లా దేవుడా గ్రామానికి చెందిన శివం ప్రజాపతి (19) డబీర్ పురాలోని మరియం స్కూల్ వద్ద నివాసం ఉంటూ తోపుడు బండిపై పానీపూరి వ్యాపారాన్ని నిర్వహిస్తున్నాడు. ఆదివారం ఓల్డ్ మలక్ పేట లోని శంకర్ నగర్‌లో శివం ప్రజాపతి పానీపూరి అమ్ముతుండగా, సైదాబాద్ కు చెందిన నీరజ్ కుమార్, రౌడీ షీటర్ అక్షయ్ కుమార్ లు పానీపూరి బండి వద్దకు వచ్చి మద్యానికి రూ.500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. దానికి శివం ప్రజాపతి అంగీకరించకపోవడంతో దాడి చేసి తోపుడు బండిని ధ్వంసం చేశారు. దాంతో భయపడ్డ శివం ప్రజాపతి రూ .200 ఇవ్వగా అక్కడి నుంచి వెళ్లిపోయారు. దాంతో బాధితుడు చాదర్ ఘాట్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసుకుని రౌడీ షీటర్ అక్షయ్ కుమార్, నీరజ్ కుమార్ల పై కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

# పకడ్బందీగా 'భూభారతి'పై అవగాహన

## జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణ రెడ్డి

కందుకూరు, ఏప్రిల్ 28 : భూభారతి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి తెలిపారు. చట్టంపై అవగాహన సదస్సును సోమవారం సాయంత్రం మండల కేంద్రంలో టంకరి రామ్ రెడ్డి ఫంక్షన్ హాల్ లో నిర్వహించారు .కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ, కోర్టులకు వెళ్లకుండా రెవెన్యూ అధికారుల సమక్షంలోనే భూ సమస్యలు పరిష్కారం అయ్యేలా చట్టం తీసుకు వచ్చినట్లు పేర్కొన్నారు . ఇది రైతులకు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. భూభారతి చట్టంలో తహసీల్దార్ నుంచి సీఎల్‌ఏ స్థాయి వరకు సమస్యల పరిష్కారానికి వెసులుబాటు కల్పించినట్లు వివరించారు. చట్టం ద్వారా భవిష్యత్తులో కూడా ఎలాంటి సమస్యలు రాకుండా ఉంటాయని అని తెలిపారు. గ్రామ పరిపాలనాధికారి నియామకాలతో గ్రామ భూ సమస్యలు తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతామన్నారు. అంతేకాకుండా ప్రభుత్వం ఆధార్ కార్డు తరహాలో భవిష్యత్తులో శాటిలైట్ ఆధారంగా భూమికి సంబంధించిన కొలతలు హద్దులో వంటి సమగ్రమైన వివరాలతో భూదారు తీసుకురాబోతుందని, తద్వారా మ్యాపింగ్ చాలా పకడ్బందీగా ఉంటుందని కలెక్టర్ తెలిపారు .ఈ భూ దార్ విజయవంతం అయితే భవిష్యత్ తరాలకు ఎలాంటి భూ ఆక్రమణ సమస్యలు ఉండవన్నారు. భూ భారతి చట్టంలో హక్కులు రికార్డుల్లో సవరణకు అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో కందుకూరు డివిజన్ ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రా స్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నరసింహారెడ్డి, మార్కెట్ చైర్మన్ సభావత్ కృష్ణ నాయక్, వైస్ చైర్మన్ యాదయ్య, ఎంపీటీసీ గీత, మండల వ్యవసాయ అధికారి లావణ్య , నాయబ్ తహసీల్దార్ శేఖర్, మాజీ జెడ్పీటీసీలు ఏనుగు జంగారెడ్డి, బొక్క జంగారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గంగుల శమంత ప్రభాకర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి, మండల కాంగ్రెస్ కోఆర్డినేటర్ ఎండి అఫ్జల్ బేగ్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సొడపు వెంకటేష్ గౌడ్, మార్కెట్ డైరెక్టర్ పుష్ప, ప్రశాంత్ కుమార్ పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చంద్రశేఖర్

కందుకూరు, ఏప్రిల్ 28: కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ దేవరశెట్టి చంద్రశేఖర్ తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. వైస్ చైర్మన్ గోపిరెడ్డి విజేందర్ రెడ్డితో కలిసి మాట్లాడుతూ, ప్రభుత్వం ఏ-గ్రేడ్ ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,320లు, కామన్ గ్రేడ్ ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,300ల ధరను నిర్ణయించినట్లు చెప్పారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం సన్న రకాలకు ప్రతి క్వింటాల్‌పై అదనంగా రూ.500 బోనస్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు . ప్రభుత్వం రైతులు పండించిన గింజను కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని కోరారు. కార్యక్రమంలో సంఘ డైరెక్టర్లు పొట్టి ఆనంద్, నర్ల నరసింహ, గౌర పర్వతాలు, సాద పాండురంగారెడ్డి, మేఘవత్ చంద్రు, మండల వ్యవసాయ అధికారి లావణ్య, ఏఈఓ రాజు, సంఘ కార్యదర్శి నిమ్మ యాదగిరి రెడ్డి, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.



పహల్గాం మృతులకు హయత్‌నగర్ డివిజన్ సూర్యనగర్ వెస్ట్‌కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళులర్పించిన కాలనీవాసులు

## ఉగ్రవాదుల చర్యలపై జనాగ్రహం



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న లక్ష్మీ నగర్ కాలనీవాసులు



సైదాబాద్ లోని సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ కార్యాలయం చౌరస్తాలో క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న ఆదిమవాసి (ఎరుకల) కోపరేటివ్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు

సైదాబాద్, ఏప్రిల్ 28 : జమ్ము కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో అమాయక పర్యాటకులపై జరిగిన ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ సైదాబాద్ ఏకలవ్య నగర్ ఆదిమవాసి(ఎరుకల) కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగ్రవాదులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేసి , ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి ఆత్మ శాంతి కలగాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఆదిమవాసి (ఎరుకల) కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

### లక్ష్మీనగర్‌లో...

లక్ష్మీ నగర్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కాలనీవాసులు స్థానికంగా క్యాండిల్ ర్యాలీని లక్ష్మీ నగర్ కాలనీ, వినయ్ నగర్, ప్రశాంత్ నగర్, థీమ్ పార్కు వరకు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్ రెడ్డి, బాలకృష్ణ గౌడ్, కోట్ల శ్రీనివాస్, వీరేందర్ బాబు, రామ్ రెడ్డి, వేణు గౌడ్, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సి.ఎస్ రెడ్డి, కాలనీ కార్యదర్శి రవీందర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### సింగరేణి కాలనీలో

కాశ్మీర్‌లోని పహల్గాం జరిగిన మారణకాండ సిగ్గు మాలిన చర్యగా అభివర్ణిస్తూ సోమవారం రాత్రి సింగరేణి కాలనీలో సీపీఐ సీనియర్ నాయకులు ఆర్.శంకర్ నాయక్, సీపీఐ ఐఎస్ సదన్ డివిజన్ కార్యదర్శి షేక్ మహమూద్ ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ, పహల్గాం మారణహోమంలో లష్కరే తోయిబా ముష్కరులకు ఉరిశిక్ష వేయాలని, అదేవిధంగా భారత ప్రభుత్వం భద్రత బలగాలను పెంచాలన్నారు. నాయకులు అమీనా, అంజయ్య, రాజు నాయక్, నర్సింగ్ రావు, వెంకటేష్ అజయ్ పాల్గొన్నారు.



క్యాండిల్ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు శంకర్ నాయక్, షేక్ మహమూద్ తదితరులు

# బడంగ్ పేట్'లో అక్రమ నిర్మాణాలపై చర్యలేవీ?

## జిల్లా కలెక్టర్ ఫిర్యాదు చేసిన మాజీ ఉపసర్పంచ్ జంగారెడ్డి



మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేసిన మాజీ ఉపసర్పంచ్ జంగారెడ్డి

బడంగ్ పేట్, ఏప్రిల్ 28: బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు చేపడుతుంటే అధికారులు పట్టించుకోవడంలేదని గుర్రంగూడ మాజీ ఉప సర్పంచ్ జక్కిడి జంగారెడ్డి రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా సెల్లార్ సహా ఏడు ఎనిమిది బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపడుతుంటే అధికారులు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. విజిలెన్స్, ప్రత్యేక అధికారికి సైతం ఫిర్యాదు చేశామన్నారు. అధికారులు కాసులకు కక్కుర్తి పడి బహుళ అంతస్తులను ప్రోత్సహిస్తున్నారని పేర్కొన్నారు. బిల్డర్ల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. కలెక్టర్‌కు, సీడీఎంఏకు, మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదులు చేసినా ఫలితం లేదన్నారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టడంతో మున్సిపల్ ఆదాయానికి గండి పడుతోందని ఆయన తెలిపారు. 26వ డివిజన్ పరిధిలోని తిరుమల్ నగర్, శ్రీ శ్రీ హోమ్స్, మల్లారెడ్డి కాలనీ, శ్రీహిల్స్, టెలికం కాలనీ, వెంకటేశ్వర కాలనీ, గడ్డం ఇన్ క్లీవ్, తదితర కాలనీలలో అక్రమ నిర్మాణాల జోరు కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు. అధికారులు చివరకు ప్రభుత్వ భూములలో అనుమతులు ఇవ్వడం శోచనీయమన్నారు. బడంగ్ పేట మున్సిపల్ కార్పొరేషన్ లో జరుగుతున్న అవినీతి అక్రమాలపై పై అధికారులు ఎందుకు దృష్టి సారించడం లేదో అర్థం కావడం లేదన్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఎవరు పట్టించుకోవడంలేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఎవరైనా సాధారణ వ్యక్తులు చిన్న ఇల్లు కట్టుకుంటే అనుమతులు లేవు అని క్షణాలలో కూల్చివేసే అధికారులు ఎలాంటి అనుమతులు లేకుండానే అడ్డగోలుగా నిర్మాణాలు చేస్తుంటే ఎందుకు పట్టించుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. అధికారుల తీరు మారనంతకాలం పరిస్థితి మారదన్నారు. అధికారులు చర్యలు తీసుకోకపోతే ఆందోళన కార్యక్రమాలు సైతం చేయడానికి వెనుకాడమన్నారు.

## ఆత్మ రక్షణ కోసం కరాటే ఉపయోగం



లేమూరులో సర్టిఫికెట్లు అందజేత

కందుకూరు, ఏప్రిల్ 28: ఆత్మ రక్షణ కోసం కరాటే ఎంతో ఉపయోగపడుతుందని బీఆర్ఎస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఎలుక మేఘనాథ్ రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని లేమూరు గ్రామంలో వారియర్స్ కరాటే ఇంటర్నేషనల్ సీనియర్ మాస్టర్ యాదగిరి ఆధ్వర్యంలో కలర్ బెల్ట్ పోటీలు నిర్వహించారు, వివిధ గ్రామాల నుండి విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. గెలుపొందిన వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. అనంతరం మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాణా ప్రతాప్ రెడ్డితో కలిసి మాట్లాడుతూ, కరాటే నిజ జీవితంలో ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీధర్ ,నారాయణ, ఆంజనేయులు, సీహెచ్ శ్రీధర్, బాలరాజు, మాస్టర్స్ శివ, నాగరాజు, మహిపాల్, శివ, శ్రీధర్, భాస్కర్, అనూష, మహాలక్ష్మి, వైశాలి, ఆదిత్య, యుగేందర్, నవీన్, అబిలాష్ పాల్గొన్నారు.

## 'మేడే' జయప్రదం చేయండి



బడంగ్‌పేట, ఏప్రిల్ 28 : మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం మీర్‌పేట్‌లోని సీఐటీయూ భవన కార్మికుల ఆఫీస్ వద్ద మే డే పోస్టర్‌ను రంగారెడ్డి జిల్లా శ్రామిక మహిళా కన్వీనర్ కవిత హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బాలాపూర్ మండల పరిధిలో ఉన్నటువంటి కార్మికులందరు మేడే కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వి.శేఖర్ యాదవ్, మండల కన్వీనర్ దాసరి బాబు, యాదయ్య చారి, సత్యం, మల్లికార్జున్, వెంకయ్య, ఆంజనేయులు, సోమ్లా నాయక్, చిన్న బాబు, శ్యామ్ పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన ఇంటి స్థలాల లబ్ధిదారులు



లబ్ధిదారులతో బాలరాజ్, తదితరులు

కందుకూరు, ఏప్రిల్ 28 : మండల సీపీఎం పార్టీ మండల కార్యదర్శి బాలరాజ్ ఆధ్వర్యంలో 788, 107 సర్వే నెంబర్లలో గల ఇళ్ల స్థలాల లబ్ధిదారులు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డిని సోమవారం కందుకూరులో కలిసి మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇండ్ల స్థలాల సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం బాలరాజ్ మాట్లాడుతూ, 2007లో 1,083 మందికి, 2023లో 330 మందికి ఇళ్ల స్థలాల సర్టిఫికెట్లు ఇచ్చారని, పలు దఫాలు కలెక్టర్ ,ఆర్డీఓ తహసీల్దార్‌కు మెమోరాండాలు ఇచ్చి, ధర్నాలు చేశామని తెలిపారు. అనంతరం లబ్ధిదారులు సంతోషపడి 788 సర్వే నంబర్‌లో స్థలాలను చదును చేసుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ మండల కమిటీ సభ్యులు గౌరవ శ్రీశైలం, చిన్నమయ్య, రాయి కంటి శేఖర్ ,దాసు, యాదమ్మ , సక్కుబాయి, రామలక్ష్మి, జంగమ్మ, శంకరమ్మ పాల్గొన్నారు

## మహిళా భవనాన్ని తనిఖీ చేసిన టీయూఎఫ్ఐడీసీ చైర్మన్

బడంగ్ పేట్, ఏప్రిల్ 28: మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని మీర్‌పేట్ కార్పొరేషన్‌లో ఉన్న మహిళా శక్తి కార్యాలయాన్ని టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నరసింహారెడ్డి తనిఖీ తనిఖీ చేశారు. మౌలిక వసతులను పరిశీలించి అడిగి తెలుసుకున్నారు. వాటిని మెరుగుపరిచే విధంగా తీర్చిదిద్దాలని కమిషనర్ ఆదేశించారు. 150 మహిళా గ్రూపులకు పావలా వడ్డీ రుణాలను ఇచ్చినందుకు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ జ్ఞానేశ్వర్, మహిళా సంఘాల నాయకురాలు పాల్గొన్నారు.

## ఆయుష్‌లో ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్ ప్రారంభం

సైదాబాద్, ఏప్రిల్ 28 : సాంప్రదాయ వైద్యంలో ప్రాథమిక, సాహిత్య పరిశోధన కోసం నియమించబడిన డబ్ల్యూహెచ్ఓ సహకారంతో నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ హెరిటేజ్ సంస్థ (ఆయుష్)లో మొట్టమొదటి ఆన్‌లైన్ ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు సంస్థ ఇన్‌చార్జి డైరెక్టర్ జీపీ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ ఆయుర్వేదిక్ సైన్సెస్ నమస్తే పోర్టల్, ఆయుష్ హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ కోఆర్డినేటర్ల కోసం రూపొందించబడిందని తెలిపారు. ఈ వర్చువల్ ను డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ (వైద్య) రబీనారాయణ్ ఆచార్య అధ్యక్షతన, నేషనల్ కమిషన్ ఫర్ ఇండియన్ సిస్టమ్ ఆఫ్ మెడిసిన్, బోర్డ్ ఆఫ్ ఆయుర్వేద చైర్మన్ డాక్టర్ బీఎస్ ప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యూహెచ్ఓ సౌత్-ఈస్ట్ ఆసియా రీజియన్, న్యూఢిల్లీ టెక్నికల్ ఆఫీసర్ డాక్టర్ పవన్ గోడత్వార్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎన్. శ్రీకాంత్ పాల్గొన్నట్లు తెలిపారు.



ఆన్లైన్ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

# షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు షాదీ ముబారక్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే బలాల

సైదాబాద్, ఏప్రిల్ 28: కోటి 36 లక్షల, పదిహేను వేల రూపాయల విలువైన 136 షాదీ ముబారక్ చెక్కులను మలక్ పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల లబ్ధిదారులకు అందజేశారు. మలక్ పేట నియోజకవర్గం పరిధిలోని సైదాబాద్, అంబర్ పేట , చార్మినార్ మండలాల పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన 136 మంది లబ్ధిదారులకు షాదీ ముబారక్ చెక్కులను సోమవారం పాతబస్తీలోని ఫంజేషాలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహిళలకు ఆయన అందజేశారు. షాదీ ముబారక్ పథకం అనేకమంది పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతోందన్నారు. అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో చార్మినార్ మండల తహసీల్దార్ మహ్మద్ మన్సూర్ అలీ, అంబర్‌పేట్ మండల ఆర్ఐ సంతోష్, మొహమ్మద్ రిజ్వాన్, సైదాబాద్ మండల వీఆర్ఓ అర్చన, తదితరులు పాల్గొన్నారు.

## అనాథ గృహ విద్యార్థులకు కంప్యూటర్లు, నగదు విరాళం



విద్యార్థులకు కంప్యూటర్‌ను అందజేస్తున్న బుచ్చిరెడ్డి

ఆర్.కె.పురం, ఏప్రిల్ 28: హైదరాబాద్- కొత్తపేట శ్రీలక్ష్మి అంబికా రెసిడెన్సీకి చెందిన మన్నెం బుచ్చి రెడ్డి సోమవారం ఎల్బీనగర్‌లోని అనాథ విద్యార్థి గృహ విద్యార్థులకు రూ. 1,02,500 విలువల గల ఐదు (5 ) కంప్యూటర్లు, వివిధ తరగతులలో చదువుతున్న విద్యార్థులకు ఫీజుల నిమిత్తం రూ. 50,000/- నగదును గృహ అధ్యక్షుడు మార్గం రాజేష్ సమక్షంలో విరాళంగా అందచేశారు. ఈ సందర్భంగా బుచ్చి రెడ్డి మాట్లాడుతూ, అనాథవిద్యార్థి గృహం ఒక అద్భుతమైన వసతి గృహమని, కమిటీ వారు అనాథ పిల్లలను చేరదీసి వారికి భోజన, వసతి, విద్యా, వైద్య, సకల సౌకర్యాలు కల్పించి, వారి భవిష్యత్తుకు నిరంతరంగా కృషి చేస్తున్నారన్నారు. అమెరికాలో ఉన్న మా చిన్న కుమారుడు వరుణ్ కుమార్ రెడ్డి ఈ విషయం తెలియచేశాడని, అందుకే గృహంలోని 120 మంది విద్యార్థులకు ఉపయోగపడే విధంగా కంప్యూటర్లు అందజేసినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు విందు భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బుచ్చి రెడ్డి సతీమణి అరుణ, పెద్ద కుమారుడు వెంకట్ రామ్ రెడ్డి హాజరయ్యారు. విరాళంగా ఇచ్చిన బుచ్చి రెడ్డికి మార్గం రాజేష్ కృతజ్ఞతలు తెలిపారు.

## గుర్తుతెలియని మృతదేహం స్వాధీనం



బడంగ్ పేట్, ఏప్రిల్ 28: ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ నాగరాజు కథనం ప్రకారం.. ఉదయం సుమారు ఏడు గంటల సమయంలో బాలాపూర్ చౌరస్తా దగ్గర ఎస్ఎల్ నెస్ కమాన్ దగ్గర గుర్తు తెలియని వ్యక్తి మరణించినట్లు ఆయన తెలిపారు. చుట్టుపక్కల విచారణ చేయగా మృతుడి వివరాలు తెలియడం లేదన్నారు. అతడి పాకెట్‌లో కూడా ఎలాంటి గుర్తింపు కార్డులు లేవన్నారు. మృతుడికి 60 సంవత్సరాలు ఉన్నట్లు గుర్తించిన జరిగిందన్నారు. తెలుపు రంగు గడ్డం, ఎత్తు 5 ఫీట్ల వరకు ఉంటాడని తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించినట్లు సీఐ నాగరాజు తెలిపారు.